సాక్షి మెదక్
శనివారం, 1, ఏప్రిల్, 2023




ఉపాధి కూలీలకు తీపి కబురు
ఉపాధిహామీ కూలీలకు రోజువారి వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీపి కబురు ఇచ్చింది. గతంలో ఉన్న కూలీ రేటుకు రూ.15 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 8లో



బాలుడిపై కుక్కల దాడి
కుక్కలు దాడిచేసి బాలుడిని గాయపర్చాయి. ఈసంఘటన మెదక్ పట్టణంలోని జంబికుంట వీధిలో శుక్రవారం చోటు చేసుకుంది. 8లో



ఇవేం బిల్లులు ?
'మన ఊరు– మన బడి' పనులు చేస్తే ఆలస్యంగా తక్కువ బిల్లులు వచ్చాయని అల్లాదుర్గం సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 9లో



సీఎంఆర్‌పై పట్టింపేది?

- జిల్లాలో రైస్‌మిల్లర్ల ఇష్టారాజ్యం
- కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు ఇచ్చింది 40 శాతమే
- మార్చితోనే ముగిసిన గడువు

మెదక్‌జోన్: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని దింపుకున్న మిల్లర్లు గడువు ముగిసినా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కు బియ్యం ఇవ్వడం లేదు. గడిచిన రెండు సీజన్లకు సంబంధించిన బియ్యాన్ని ఇప్పటివరకు కేవలం 40 శాతం మాత్రమే సీఎంఆర్‌కు ఇవ్వగా ఇంకా 60 శాతం ఇవ్వాల్సి ఉంది.

- జిల్లావ్యాప్తంగా 160 రైస్ మిల్లులు ఉన్నాయి. ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని నేరుగా మిల్లులకు పంపుతున్నారు.
- కాగా అక్కడ ధాన్యాన్ని మరాడించి గడువులోగా బియ్యాన్ని సీఎంఆర్‌కు పంపించాలి.
- కానీ గడువు ముగిసినా బియ్యాన్ని ఇవ్వడంలో మిల్లర్లు అలసత్వం వహిస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ఇందుకు సంబంధించి ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం మండలాల్లో పలు రైస్ మిల్లులను తనిఖీ చేశారు.
- కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని దింపుకున్న మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని నేరుగా సీఎంఆర్‌కు ఇస్తున్నారా..? లేక పక్కదారి పట్టిస్తున్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు.
- అయితే మిల్లర్లు గడువు దాటినా సీఎంఆర్‌కు బియ్యం ఇవ్వడం లేదు. దీనిపై ఇటీవల అదనపు కలెక్టర్ సైతం సమావేశం ఏర్పాటు చేసి సకాలంలో బియ్యం గోదాంలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పక్కదారి పడుతున్న ధాన్యం

- ప్రతిఏటా యాసంగి, వానాకాలంలో ధాన్యాన్ని మరాడించి ఇవ్వాలని జిల్లాలోని 160 రైస్ మిల్లులకు ధాన్యాన్ని పంపుతున్నారు.
- అయితే ధాన్యాన్ని దింపుకున్న మిల్లర్లు కొందరు లారీలను పక్కరాష్ట్రాలకు తరలించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ప్రతినెల చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం తీసుకునే ప్రజలు 90 శాతం మంది వాటిని కిలోకు రూ. 10 నుంచి రూ. 12 చొప్పున విక్రయిస్తున్నారు.
- కొందరు వ్యాపారులు పల్లెల్లో తిరుగుతూ బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు కిలోకు రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు.
- వాటిని కొనుగోలు చేసిన మిల్లర్లు ఆ బియ్యాన్నే తిరిగి సీఎంఆర్‌కు ఇస్తున్నారు. ఇలా రైస్‌మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.


కౌడిపల్లిలోని ఓ రైస్‌మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ (ఫైల్)

మూడు సీజన్ల వివరాలు

2021–22 వానాకాలంలో 157 మిల్లులు 3,87,733 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకున్నాయి. ఇందుకు సంబంధించి 2,59,781.11 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలి.

- కానీ 2,33,610.32 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే సీఎంఆర్‌కు ఇచ్చారు. మిగిలిన 26,171 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేయాల్సి ఉంది.
- 2021– 22 యాసంగిలో 135 రైస్‌మిల్లులకు గానూ 2,58,145 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా ఇందుకు 1,75,540.84 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్‌కు అందజేయాలి.
- ఇప్పటివరకు 89,752.45 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఈలెక్కన ఇంకా సీఎంఆర్‌కు 85,788 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.
- కాగా యాసంగికి సంబంధించి కేవలం 51 శాతం బియ్యం మాత్రమే సీఎంఆర్‌కు ఇవ్వగా ఇంకా 49 శాతం ఇవ్వాల్సి ఉంది.
- గతేడాది వానాకాలం, యాసంగికి సంబంధించి మార్చి వరకు బియ్యం ఇవ్వాల్సి ఉండగా రైస్ మిల్లర్లు ఇంకా ఇవ్వలేదు.
- 2022– 2023 వానాకాలంలో 160 రైస్ మిల్లులకు గానూ 3,87,615.16 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు.
- ఇందుకు సంబంధించి 2,59,702.16 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్‌కు ఇవ్వాల్సి ఉంది.
- కానీ ఇప్పటివరకు కేవలం 2,523 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఇచ్చారు. ఇంకా 2,57,179 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్‌కు ఇవ్వాల్సి ఉంది.

దేశానికి తెలంగాణే మోడల్


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన తెలంగాణను దేశంలోనే అభివృద్ధి రాష్ట్రంగా ముందుకు తీసుకువెళ్తున్న సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొంతిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు రూపాయి ఇవ్వం అని అసెంబ్లీ సాక్షిగా అంటే అప్పటి కాంగ్రెస్ నేతలు ఎం మాట్లాడలేదని అన్నారు. మేనిఫెస్టోలో లేని పథకాలను అమలు చేస్తూ అన్నివర్గాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసిన విషయం గుర్తుచేశారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులు కేంద్రం ఇవ్వడం లేదని విమర్శించారు. మెడికల్ కాలేజీలు, నవోదయలు, నర్సింగ్ కాలేజీలు, కోచ్ ఫ్యాక్టరీలను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి సెస్‌ల రూపంలో 89.967 కోట్లు వసూలు చేసిందన్నారు. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నారని వాపోయారు. చివరకు రైతులు ఉపయోగించే ట్రాక్టర్, బీపీ మందు గోలీలపై 12 శాతం ధరలు పెంచిందన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పలు గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, ధరణిలో నెలకొన్న సమస్యలను ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

నర్సాపూర్‌లో పార్టీ పటిష్టం: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం దిశగా ముందుంటామని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు అభివృద్ధి విషయం మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలకే పరిమితమైందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షురాలు లావణ్య, నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

న్యూస్‌రీల్

నేటి నుంచి పోలీస్ యాక్ట్

- ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: నేటి నుంచి ఈనెల 30 వరకు జిల్లావ్యాప్తంగా పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నా, రాస్తారోకో, నిరసన, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. అలాగే శాంతి భద్రతలకు భంగం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. అనంతరం మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట గల గ్రౌండ్‌లో ఆర్‌ఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి, ఫుట్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి సిబ్బంది పరేడ్‌ను పర్యవేక్షించారు. పరేడ్‌తో సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు అనారోగ్యం దరిచేరదని అన్నారు.

'అక్రమ దత్తత నేరం'

అల్లాదుర్గం(మెదక్): గ్రామాల్లో పిల్లలను అక్రమ దత్తత తీసుకున్నా, బాల్య వివాహాలు చేసిన కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణకు మండలస్థాయి కమిటీ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శంకర్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

మెదక్‌జోన్: బీజేపీ మహిళా మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ నందా దగ్గా రెండు రోజులు పాటు మెదక్‌లో పర్యటించనున్నట్టు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నేడు అంగన్‌వాడీ కేంద్రాల విజిట్‌తో పాటు బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం, ఈనెల 2న ఏడుపాయల వనదుర్గా అమ్మవారి దర్శనం, అనంతరం నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, అసెంబ్లీ కన్వీనర్ దేవీ మధుసూదన్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అందించాలి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని పలు బీడీ కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మద్దెల మల్లేశం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అందించాలని కోరారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్రటరీ హాజీ పాషా, శ్రీశైలం, దత్తు, బాపురెడ్డి, లింగం, భద్రయ్య, రాజయ్య, పాల్గొన్నారు.

మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జన్నారెడ్డి

మెదక్‌జోన్: మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జన్నారెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికల అధికారి సిరిగే ప్రభాకర్ ఫలితాలను వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపతిరావు, సంయుక్త కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా దుర్గారెడ్డి, ఈసీ సభ్యులుగా శారద, రవిగౌడ్, కేఎల్‌ఎన్ దత్, ఆఫీస్ అలీబేగ్, కేసరిసాయిలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు.


నూతన కార్యవర్గ సభ్యులు

పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయండి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ రూరల్: పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని ఆదేశించారు. శుక్రవారం మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎస్‌ఐ మోహన్‌రెడ్డికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌ను ప్రతి రోజు పరిశుభ్రంగా ఉంచాలని, వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్ ఎంఎస్, ఆన్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు వంటివి పకడ్బందీగా చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని.. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

'కంటి వెలుగు'తో మేలు


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పర్కిబండ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, సర్పంచ్ పూల అర్జున్, ఉప సర్పంచ్ కాయితమ్మ, నాయకులు శ్రీరాం, శ్రీనివాస్, నర్సింలు, నరహరి, నాగభూషణం, వైద్యులు జ్యోత్స్నాదేవి, కార్యదర్శి నాగరాజుగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్ష

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో శుక్రవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఒకేషనల్ పరీక్ష నిర్వహించారు. 287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 267 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరైనట్లు జిల్లా పరీక్షల కమిటీ అధికారి సత్యనారాయణ తెలిపారు.

ఉత్తమ జీపీలకు అవార్డుల ప్రదానం


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శంకర్


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శ్యామల

నర్సాపూర్ రూరల్/ రామాయంపేట(మెదక్): ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన ప్రగతి ధర్మారం, చిప్పల్‌తుర్తి గ్రామాల సర్పంచ్‌లు శంకర్, శ్యామల లక్ష్మణ్‌గౌడ్ శుక్రవారం అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వీరికి అవార్డులను ప్రదానం చేశారు.

కొడకండ్ల–దుద్దెడ ట్రాక్‌పై ట్రయల్‌రన్


కొడకండ్ల–దుద్దెడ రైల్వే లైన్‌పై వచ్చిన రైలు ఇదే..

పాల్గొన్న కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ అధికారుల బృందం

గజ్వేల్/కొండపాక: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే మార్గంపై శుక్రవారం మరో ట్రయల్‌రన్ జరిగింది. ఈ లైన్‌పై గతేడాది మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా కొడకండ్ల వరకు రెండుసార్లు 41 కిలోమీటర్ల మేర కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ స్పీడ్ టెస్ట్ విజయవంతంగా పూర్తికాగా, తాజాగా కొడకండ్ల నుంచి దుద్దెడ వరకు ట్రయల్‌రన్ చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వేశాఖ కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ బాధ్యులు ప్రంజయ్‌సక్సేనా ఆధ్వర్యంలో ఈ ట్రయల్‌రన్ జరిగింది. మొత్తంగా 21కిలోమీటర్ల మేర 125 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ టెస్ట్ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ బృందం రైల్వే ట్రాక్ నిర్మాణం, దుద్దెడ వద్ద మినీస్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 151 కిలోమీటర్ల మేర ఉన్న ఈ లైన్‌పై ఇప్పటి వరకు 62 కిలోమీటర్ల పైన మాత్రమే ట్రయల్‌రన్ పూర్తి చేశారు. త్వరలోనే సిద్దిపేట వరకు ట్రయల్‌రన్ జరిగే అవకాశాలున్నాయి. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వేశాఖ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) నీరజ్ అగర్వాల్, హైద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం శరత్ చంద్రాయన్ చీఫ్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్ రవి కల్బాండేతో పాటు స్థానికంగా రైల్వేలైన్ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీర్ జనార్దన్ పాల్గొన్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకే అనర్హత

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్

మెదక్‌జోన్: కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రధాని మోదీ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ విమర్శించారు. శుక్రవారం మెదక్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు అన్ని రాష్ట్రాల్లో విశేష ఆదరణ లభించిందన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రతిపక్షాలు లేకుండా కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. సోనియా, రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సాగిస్తున్న నియంతపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈడీ ముందు హాజరుకావడానికి కవిత ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆవుల రాజిరెడ్డి, మ్యాడం బాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, గూడూరు ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్

మూడోవారంలో ధాన్యం కొనుగోళ్లు

- జిల్లావ్యాప్తంగా 413 కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఈనెల మూడోవారంలో జిల్లావ్యాప్తంగా 413 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రబీలో 94 వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారని.. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం మార్కెట్‌కు 5 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 290, ఐకేపీ ద్వారా 110, డీసీఎంఎస్ ద్వారా 8, రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏ– గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,060, సాధారణ రకం రూ. 2,040 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం సేకరణకు కోటి 50 లక్షల గోనె సంచులు అవసరం కాగా రూ. 75 లక్షలు అందుబాటులో ఉన్నాయని.. మిగితా వాటికి చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓకు సూచించారు. ట్యాబ్ ఎంట్రీ కోసం కొత్త వర్షన్ 8.0 నూతన ట్యాబ్‌లు కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, యంత్రాలు, డిజిటల్ కాంటాలు అందుబాటులో ఉంచుకోవాలని మార్కెటింగ్ అధికారికి సూచించారు. వెయ్యి లారీలు అందుబాటులో ఉంచుతూ రైస్ మిల్లులకు జియో ట్యాగింగ్ చేయాలని రవాణశాఖ అధికారికి సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి, డీసీఓ కరుణ, అడిషనల్ పీడీ భీమయ్య, మార్కెటింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన అదనపు కలెక్టర్ రమేశ్

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 3వ తేదీ నుంచి 13 వరకు జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 10,700 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 69 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు తమ పరిధిలోని అన్ని పరీక్ష కేంద్రాలను శుభ్రం చేసి అవసరమైనా చోట తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు.

త్వరగా 'డబుల్' ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. చిన్న చిన్న పనులతో పాటు తాగునీటి సరఫరా, సెప్టిక్ ట్యాంక్ వంటి నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి జాబితా ప్రదర్శించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగారావు, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈలు, ఏజెన్సీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

- పెరిగిన కూలీ రేట్లు
- ఏప్రిల్‌ ఒకటి నుంచి అమలు

సిద్దిపేటరూరల్‌: ఉపాధిహామీ కూలీలకు రోజువారి వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీపి కబురును ఇచ్చింది. గతంలో ఉన్న కూలీ రేటుకు రూ.15 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్‌ 1 నుంచి పెంచిన కూలి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో జిల్లాలోని 4 లక్షలకు పైగా ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరనుంది.

ఉపాధే ఆధారం

చాలా మంది ఉపాధిహామీ పనులే ఆధారంగా జీవనం సాగించే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రోజువారీ కూలికి అదనంగా రూ. 15 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్లైన్లో నమోదైన పనిదినాల ఆధారంగానే చెల్లింపులు జరగనున్నాయి. కూలీల ఖాతాల్లోకి నేరుగా ఈ మొత్తాన్ని పాత పద్ధతిలోనే జమ చేయనున్నారు. ఒక కూలీ 100రోజులు పనిచేస్తే గతంలో రూ.25,700లు జమ అయ్యేవి. ప్రస్తుతం పెంచిన కూలితో వంద రోజులకు రూ.27,200లు ప్రభుత్వం చెల్లించనుంది.

వేసవి భత్యం లేమితో కొంత ఊరట

వేసవి కాలం ఉపాధి హామీ కూలీకి వెళ్లే వారికి 5 నెలల పాటుగా కొంత మొత్తం అదనపు కూలీకింద ప్రభుత్వం వేసవి భత్యంగా అందించేది. ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి వేసవిభత్యం సాఫ్ట్‌వేర్‌ కారణంగా నిలిపేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఒకరోజు కూలిపై అదనంగా రూ.15 పెంచడంతో కూలీలకు కొంత ఊరట లభించింది. దీంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధిహామీ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు

రోజువారి కూలీకి రూ.15 కేంద్ర ప్రభుత్వం పెంచిన విషయం వాస్తవం. ఇది ఏప్రిల్‌ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు నేరుగా ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలో యాక్టివ్‌ జాబ్‌కార్డులు కలిగి ఉన్న కూలీలు పని కోసం దరఖాస్తు చేసుకుని, పని చేస్తే నూతనంగా అందించబోయే వేతనాన్ని పొందేందుకు అవకాశం ఉంది.



–చంద్రమోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

సైబర్‌ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రవీందర్‌

దుబ్బాకరూరల్‌: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎనగుర్తి ప్రభుత్వ పాఠశాలలో సైబర్‌ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలపై వారు వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రవీందర్‌ మాట్లాడుతూ పోక్సోచట్టం, ఆన్‌లైన్‌ మోసాలు, కస్టమర్‌కేర్‌ మోసాలు, మొబైల్‌ ఫోన్‌ ఉపయోగించడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన చెప్పారు. పదోతరగతి విద్యార్థులు ఫోన్లకు, టీవిలకు దూరంగా ఉండాలన్నారు. రాబోయే పరీక్షల్లో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, హెడ్‌ కానిస్టేబుల్‌ నాగేశ్వరరావు, హరికృష్ణ, రాజిరెడ్డి, సంపత్‌, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

కొల్చారం(నర్సాపూర్‌): కొల్చారం మండలం సంగాయిపేటలో శుక్రవారం తెల్లవారుజామున పూరిల్లు దగ్ధమైన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల, స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పుర్ర నవరాణి పూరిల్లులో నివాసం ఉంటుంది. తెల్లవారుజామున గుడిసె వెనుక నుంచి మంటలు చెలరేగడంతో ఇది గమనించిన ఆమె కేకలు వేసుకుంటూ బయటకు వచ్చింది. కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు లేచి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే పూరిల్లు మొత్తం కాలిపోయింది. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనలో తిండి గింజలు, బట్టలు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయన్నారు. కట్టు బట్టలే మిగిలాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలతో పాటు, గ్రామస్థులు కోరారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నర్సాపూర్‌రూరల్‌: ప్రమాదవ శాత్తు చెరువు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్‌ మండలం ఖాజీపేట గ్రామంలో చోటు చేసుకుంది. నర్సాపూర్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట గ్రామానికి చెందిన మంగలి ప్రభాకర్‌ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన పశువులను మేపడం కోసం గ్రామ శివారులోని తాబేలు కుంట వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి ప్రభాకర్‌ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా

నారాయణఖేడ్‌: ఖేడ్‌ పట్టణంలోని మమత హోటల్‌ యజమాని రోడ్డుపై చెత్త వేసినందుకు గాను శుక్రవారం మున్సిపల్‌ శానిటరీ అధికారి శ్రీనివాస్‌ రూ.600 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా వేస్తామన్నారు. దుకాణాలు, ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లోనే వేయాలని ఆయన సూచించారు.

ఇంటిపై రాళ్ల దాడి చేశారని ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్‌: ఇంటిపై రాళ్ల దాడి చేశారని పట్లోళ్ల సరిత పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు పట్లోళ్ల సరిత ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... పటాన్‌చెరు పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన పట్లోళ్ల సరిత ఇంటిపై గురువారం రాత్రి కార్పొరేటర్‌ వర్గీయులు ఇంట్లోకి వచ్చే ప్రయత్నం చేశారని, దీంతో ప్రధాన గేట్‌తో పాటు, ఇంటికి తాళం వేశానని ఆమె చెప్పారు. తెల్ల షర్టు వేసుకున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు యువకులు ఇంటిపై రాళ్ల దాడికి పాల్పడ్డారని, ఇంటి కిటికీలతోపాటు, కారు డ్యామేజ్‌ అయిందన్నారు. తెల్ల షర్ట్‌ వేసుకున్న వ్యక్తిని స్థానికుల ద్వారా వివరాలు తెలుసుకోగా అతను కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అల్లుడు సన్నీ అని తెలుసుకున్నానన్నారు. తన ఇంటిపై రాళ్ల దాడి చేసిన సన్నీతో పాటు మరో ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బాధితురాలు పట్లోళ్ల సరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాళ్ల దాడిలో పగిలిన కిటికీ అద్దాలు

కల్వర్టును ఢీకొట్టిన గూడ్స్‌ వాహనం

డ్రైవర్‌ మృతి, నలుగురికి గాయాలు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): కల్వర్టును గూడ్స్‌ వాహనం ఢీ కొట్టడంతో డ్రైవర్‌ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని ఖానాపూర్‌(బి) రోడ్డు వద్ద సంగారెడ్డి–నాందేడ్‌ 161 జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్‌ హనీఫ్‌(47) బొలేరో గూడ్స్‌ వాహనంలో నిజామాబాద్‌ వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఖానాపూర్‌(బి) రోడ్డు వద్ద కల్వర్టును ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. వాహనంలో ప్రయాణిస్తున్న అవుటి లచ్చమ్మ, రంజిత్‌నాయక్‌, లక్ష్మీ, కళావతి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు నారాయణఖేడ్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతుడి సోదరుడు జునైద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కల్హేర్‌ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్‌ తెలిపారు.



మహ్మద్‌ హనీఫ్‌ మృతదేహం

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

మెదక్‌ మున్సిపాలిటీ: కుక్కలు దాడిచేసి బాలుణ్ని గాయపర్చిన సంఘటన శుక్రవారం మెదక్‌ పట్టణంలోని జంబికుంట వీధిలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జంబికుంట వీధికి చెందిన గూడ దివ్య శ్రీనివాస్‌ల ఆరేళ్ల కుమారుడు సాయిచైతన్య ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్కలు ఒక్కసారిగా బాలునిపై దాడిచేసి గాయపర్చాయి. ఆగ్రహించిన తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన బాలుణ్ని మున్సిపల్‌ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్‌ సమావేశానికి తీసుకొచ్చారు. కుక్కలు, కోతులతో ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా? అంటూ మున్సిపల్‌ చైర్మన్‌, కమిషనర్లను నిలదీశారు. వెంటనే స్పందించిన అధికారులు కోతులు, కుక్కల బారినుంచి కాపాడే విధంగా తగిన చర్యలు చేపట్టాలని వారు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆ బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. అనంతరం వార్డు కౌన్సిలర్‌ రాగి వనజ మాట్లాడుతూ కోతులు, వీధి కుక్కల నివారణా చర్యలు చేపట్టాలని గతంలో మున్సిపల్‌ చైర్మన్‌, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వల్లే చిన్నారులు సైతం కుక్కల దాడిలో గాయపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



కుక్కల దాడిలో గాయపడిన సాయిచైతన్య

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రాజు (ఫైల్‌)

సిద్దిపేటరూరల్‌: కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన పుల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పుల్లూరు గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజు(43) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు చూపించిన నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో శుక్రవారం ఉదయం ఇంటి వెనకాల ఉన్న షెడ్డులో ఉరి వేసుకున్నాడు. కుమారుడు లోకేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్‌): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జయపురం, లక్ష్మీనగర్‌ శివారులో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... గాంధారిపల్లికి చెందిన మిద్దెల సిద్ధిరాములు(26) కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. భార్య మౌనిక కొన్ని రోజుల క్రితం గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో లక్ష్మీనగర్‌, జయనగర్‌ రోడ్డు పక్కన పడిపోయాడు. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. మృతుడి బంధువు పోచమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సిద్ధిరాములు (ఫైల్‌)

వేధింపుల కేసులో 20ఏళ్ల జైలు

- పోక్సో కింద యువకుడికి శిక్ష
- రూ. 10వేల జరిమానా

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): వేధింపునకు పాల్పడిన నేరానికి ఓ యువకుడికి అడిషనల్‌ డిస్ట్రిక్‌, సెషన్స్‌ జడ్జి జైలు శిక్ష విధించింది. గజ్వేల్‌ ఏసీపీ రమేశ్‌ శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జగదేవ్‌పూర్‌ మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన రమేశ్‌(28) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల పాపతో అసభ్యకరంగా ప్రవర్తించి, లైగింక వేధింపులకు గురి చేశాడు. దీంతో పాప కుటుంబీకులు 2021, నవంబర్‌ 24న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ పరమేశ్వర్‌ కేసు నమోదు చేయగా ఏసీపీ రమేశ్‌ కేసు పరిశోధన ప్రారంభించి నేరస్థుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్‌ రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా అడిషనల్‌ డిస్ట్రిక్‌, సెషన్స్‌ జడ్జి ఇరువురి వాదనలు విన్నారు. నేరం రుజువైనందునా నిందితుడు రమేష్‌కు 20 సంవత్సరాల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వెంకటలింగం, గజ్వేల్‌ ఏసీపీ రమేశ్‌, ఎస్‌ఐ పరమేశ్వర్‌, గజ్వేల్‌ రూరల్‌ సీఐ రాజశేఖర్‌రెడ్డి, తొగుట సీఐ కమలాకర్‌, జగదేవ్‌పూర్‌ ఎస్‌ఐ కృష్ణమూర్తి, కానిస్టేబుల్‌ బాపురెడ్డి, లావణ్య విట్టల్‌, కోర్టు లైజనింగ్‌ ఏఎస్‌ఐ స్వామిదాస్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రాజమల్లయ్యను సీపీ శ్వేత అభినందించారు.

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి...



దిడ్డి బేతయ్య మృతదేహం

కల్హేర్‌(నారాయణఖేడ్‌): శ్రీరామ నవమి సందర్భంగా బండ్లు కడిగేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం రాంరెడ్డిపేట గ్రామానికి చెందిన దిడ్డి పోశెట్టి లచ్చవ్వ దంపతుల కుమారుడు దిడ్డి బేతయ్య(24) మరో యువకుడు చాకలి సాయిలుతో కలిసి నిజాంసాగర్‌ ప్రాజెక్టు సమీపంలో బండ్లు శుభ్రం చేసేందుకు వెళ్లారు. ప్రాజెక్టు మధ్యలో జేసీబీ గోతులు ఉండడంతో బండ్లు కడుగుతున్న దిడ్డి బేతయ్య, చాకలి సాయిలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు చాకలి సాయిలును నీటిలో నుంచి బయటకు తీశారు. దిడ్డి బేతయ్యను ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మత్స్యకారులు చేపలు పట్టే వలలతో మృతదేహన్ని శుక్రవారం మధ్యాహ్నం ఒడ్డుకు చేర్చారు. బేతయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇక్కడ జరగాల్సిన జాతర ఉత్సవాలను వాయిదవేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్హేర్‌ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్‌ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్‌): అనుమానా స్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వడియారం రుద్రవోని కుంటలో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అనంతసాగర్‌ గ్రామానికి చెందిన చిక్కుడు నరేష్‌(25) ఈ నెల28 నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయమై అతడి మామ బోనగిరి రాజు చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో అనంతసాగర్‌ సమీపంలోని రుద్రవోని కుంటలో ఒక మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గ్రామస్తులు కుళ్లిన శవాన్ని గుర్తుపట్టలేకపోయారు. మృతుడి భార్య సింధూజ చేతికున్న నల్లదారంతో పాటు ఉంగరం ఆధారంగా తన భర్త నరేశ్‌గా గుర్తించింది. నరేశ్‌ మృతిపై అనుమానాలున్నాయని అతడిని కావాలనే ఎవరో హత్య చేశారని మామ రాజుతో పాటు మృతుడి బంధువులు ఆరోపించారు. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

కర్ణాటక ప్రాజెక్టులో దూకి ఎంఆర్‌ఎఫ్‌ ఉద్యోగి ఆత్మహత్య

జహీరాబాద్‌: మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన ఎంఆర్‌ఎఫ్‌ ఉద్యోగి మంగలి సాయికుమార్‌(22) కర్ణాటకలోని ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం....సాయికుమార్‌ సదాశివపేటలోని ఎంఆర్‌ఎఫ్‌ ప్రొడక్షన్‌ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి నానమ్మ భారతమ్మకు ఫోన్‌ చేశాడు. తాను గొట్టం కోట అడవికి వెళుతున్నట్లుగా, ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందని చెప్పాడన్నారు. ఎందుకు అలా మాట్లాడుతున్నావని ఆమె సాయికుమార్‌ను ప్రశ్నించింది. అనంతరం ఫోన్‌ చేసినా అతను ఎత్తలేదు. దీంతో కుటుంబ సభ్యులు చించోళి పోలీసులను సంప్రదించారు. వారు ఫోన్‌ సిగ్నల్‌ ఆధారంగా చంద్రంపల్లి ప్రాజెక్టు వద్ద గాలించారు. అక్కడ అతని ఫోన్‌, చెప్పులు లభ్యమయ్యాయి. కానీ సాయికుమార్‌ ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానంతో ప్రాజెక్టులో గాలించారు. అయినప్పటికీ అతని జాడ కనిపించలేదు. శుక్రవారం సాయంత్రం శవం కనిపించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తండ్రి జనార్దన్‌ ఫిర్యాదు మేరకు చించోళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సాయికుమార్‌(ఫైల్‌)

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చేగుంట(తూప్రాన్‌): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని మక్కరాజీపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. సర్పంచ్‌ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాషబోయిన మల్లేశ్‌ తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దును మేపడానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌కు గురైన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో రూ.50వేలు నష్టం వాటిల్లిందని మల్లేశ్‌ తెలిపారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

జోగిపేట(అందోల్‌): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరియని మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ డీబీ నాగభూషణం అన్నారు. శుక్రవారం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగి బాగమ్మ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్‌ రాజు, వైస్‌ ప్రిన్సిపాల్‌ గోపాల్‌, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డికి తరలిన బీజేపీ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి శుక్రవారం స్థానిక నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు నర్సింగ్‌ గౌడ్‌, ప్రధాన కార్యదర్శి బలరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఒక శక్తివంతంగా తయారవుతుందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్లు సాధించాలి

జోగిపేట(అందోల్‌): పదో పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించాలని అందోలు ఎంపీడీఓ సత్యనారాయణ, పీఏసీఎస్‌ చైర్మన్‌ నరేందర్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెన్నెల యువజన సంఘం, సర్పంచ్‌ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో డాకూర్‌ సర్పంచ్‌ కళాలి, ఎంపీటీసీ ప్రమీల, ఉప సర్పంచ్‌ అజయ్‌, కార్యదర్శి వినీత్‌, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మకు బోనాలు



బోనాల ఊరేగింపులో జయశ్రీరెడ్డి

నారాయణఖేడ్‌: మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం పోచమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పోచమ్మతల్లికి బోనాలను సమర్పించారు. ఖేడ్‌ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి బోనాల ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ దొడ్ల నర్సమ్మ, ఉప సర్పంచ్‌ సత్యనారాయణ, కురుమసంఘం బాధ్యులు మల్‌గొండతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 9 నెలల జైలు

సిద్దిపేటకమాన్‌: దొంగతనం కేసులో నేరస్తునికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. టూటౌన్‌ సీఐ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట అర్బన్‌ లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల రవీందర్‌ రెడ్డి 2019 ఏప్రిల్‌ 22న పని నిమిత్తం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఇంటికొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రూ.40వేలు దొంగిలించినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై టూటౌన్‌ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ సాంబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేడ్చల్‌ జిల్లా దండేపల్లి మండలం, గూడెం గ్రామానికి చెందిన తాండ్ర ప్రదీప్‌ను దొంగతనం చేసినట్లుగా గుర్తించి విచారణ అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టులో విచారణ, వాదనలు విన్న న్యాయమూర్తి శ్రావణి నిందితునికి రూ.500 జరిమానాతో పాటు 9 నెలల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రూపారెడ్డి, కానిస్టేబుల్‌ స్వామి, అమరేందర్‌, స్వామిదాస్‌, సీఐ రవికుమార్‌ సీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి ఆత్మహత్య

జహీరాబాద్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తాగిన మైకంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రంలోని కుంచవరం గ్రామానికి చెందిన జి.శ్రీకాంత్‌(24) జహీరాబాద్‌లోని ఓ దాభాలో పనిచేస్తున్నాడు. మోటారు సైకిల్‌పై వెళుతూ తాగిన మైకంలో గురువారం రాత్రి రాంనగర్‌ వద్ద ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో ప్రమాదంలో శ్రీకాంత్‌తో పాటు ఎదుటి వ్యక్తి కూడా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న శ్రీకాంత్‌ రాత్రి 11 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. గతేడాది పని చేసిన జహీరాబాద్‌లోని వాటర్‌ ప్లాంట్‌కు వెళ్లాడు. అక్కడ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'108'లో మహిళ ప్రసవం

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన మాధవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొస్తుండగా లక్డారం గ్రామ శివారులోకి రాగానే మాధవికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ శ్యామ్‌ 108 వాహనంలోనే ప్రసవం చేశారు. ఆమె మగ శిశువుకి జన్మనిచ్చింది. తల్లీబిడ్డను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినట్లు శ్యామ్‌ తెలిపారు. మాధవి కుటుంబ సభ్యులు ఈఎంటీ శ్యామ్‌తో పాటు పైలెట్‌ ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



శిశువుని మాధవి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్యామ్‌

నేరస్తులకు శిక్ష పడితే.. నేరాలు తగ్గుముఖం

సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్‌: నేరస్తులకు ఆయా కేసుల్లో శిక్షలు పడితే నేరాలు తగ్గి ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుందని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎస్‌ శ్వేత అన్నారు. పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో ఏసీపీలు, సర్కిల్‌ సీఐలతో సీపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోక్సో కేసుల్లో సంబంధిత సాక్షులకు భరోసా సెంటర్లో అధికారులు, సిబ్బంది కౌన్సిలింగ్‌ ఇవ్వాలని ఆమె సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ట్రయల్‌ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్‌ అధికారులు తప్పకుండా మానిటర్‌ చేయాలన్నారు. కోర్టు వారిగా కేలండర్‌ తయారు చేయాలని తెలిపారు. పెండింగ్‌లోని పెట్టి కేసులను డిస్పోజల్‌ చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్‌ ఏసీపీ రమేశ్‌, సీఐలు భిక్షపతి, రవికుమార్‌, భానుప్రకాశ్‌, జానకీరామ్‌రెడ్డి, మహిళా పోలీస్‌ స్టేషన్‌ సీఐ దుర్గా, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్వేత

గుర్తు తెలియని వ్యక్తుల మెసేజ్‌లు ఓపెన్‌ చేయొద్దు

సిద్దిపేటకమాన్‌: గుర్తు తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు ఓపెన్‌ చేయొద్దని సీపీ శ్వేత సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి మర్చంట్‌ ప్లేస్‌కి ఓ మెసేజ్‌ వచ్చింది. ఆ మెసేజ్‌ను సదరు బాధితునికి ఫోన్‌ చేసి ఓపెన్‌ చేయాలని తెలిపాడు. అది నమ్మిన అతను మెసేజ్‌ను ఓపెన్‌ చేశాడు. వెంటనే అతని బ్యాంకుఖాతా నుంచి రూ.25వేలు డెబిట్‌ అయినట్లు మెసేజ్‌ వచ్చింది. ఈ విషయంలో బాధితుడు సైబర్‌ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్‌, ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-795295]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్‌ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్‌: 70826 10569, 70831 25169. [NA-5468]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని కి3500/– సంపాదించుకోండి. వాట్సాప్‌ చేయండి. 9959617233, 9160855146 [M-1190657]

■ హరేకృష్ణ హోంకేర్‌, నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం. జీతం:16k - 18k విజయవాడ.ఫోన్‌: 9640528899, 9640648899 [H-793405]

■ Wanted Teachers (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.